సాక్షి
హనుమకొండ
ఆదివారం । 19 । మార్చి । 2023



బాల్య వివాహాలను కట్టడి చేద్దాం

బాలల హక్కులను కాపాడటంతోపాటు బాల్య వివాహాలను కట్టడి చేద్దామని వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ పిలుపునిచ్చారు.

- 8లో



అనాథలను కదిలిస్తే కన్నీళ్లే..!

చివరి మజిలీలో ఆదరణ లేక కొందరు వృద్ధులు ఆశ్రమంలో కాలం వెళ్లదీస్తున్నారు. వారిని కదిలిస్తే కన్నీటి పర్యంతమవుతున్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
31.0°/19.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు వరల్డ్ పీస్ పోయెట్స్ మీట్

హన్మకొండ కల్చరల్ : ఓరుగల్లు కేంద్రంగా వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ అధ్వర్యంలో ప్రపంచశాంతిని కోరుతూ 'ఈ యుద్ధాలు ఎవరి కోసం?' అనే అంశంపై ఆదివారం సాయంత్రం అశోకా హోటల్ కన్వెన్షన్‌హాల్‌లో వరల్డ్ పీస్ పోయెట్స్ మీట్ బహుభాషా సమ్మేళనం జరగనుంది. ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్, కేయూ వీసీ తాటికొండ రమేశ్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్, ప్రముఖ కవి రామాచంద్రమౌళి ఆత్మీయ అతిథులుగా పాల్గొననున్నారు. దేశంలోని నలుమూలల నుంచి తెలుగు, హిందీ, ఇంగ్లిష్, తమిళం, ఉర్దూ, గుజరాతీ తదితర భాషల కవులు హాజరై ప్రపంచశాంతి కోసం తమ కవితలను వినిపిస్తారని సొసైటీ వ్యవస్థాపకులు మహ్మద్ సిరాజుద్దీన్ తెలిపారు. కవులు, కళాకారులు సాహితీవేత్తలు, నగరవాసులు పాల్గొనాలని సొసైటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ సురేష్‌లాల్, కార్యదర్శి శ్రీపాద సుధాకర్‌రావు కోరారు. కవితలను 99497 10085 వాట్సాప్ నంబర్ ద్వారా ఆదివారం మధ్యాహ్నం వరకు పంపవచ్చని తెలిపారు.

ఇంటర్ పరీక్షల్లో 403 మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: జిల్లాలోని 49 పరీక్ష కేంద్రాల్లో కొనసాగుతున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో శనివారం 403 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ ఎ.గోపాల్ తెలిపారు. జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి మొత్తంగా 15,492 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. అందులో 15,089 మంది పరీక్షలు హాజరుకాగా.. 403 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

వరంగల్ జిల్లాలో 314 మంది...

కాశిబుగ్గ: ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్ష ఇంగ్లిష్ పేపర్‌ను శనివారం నిర్వహించారు. వరంగల్ జిల్లాలోని 27 పరీక్ష కేంద్రాల్లో 6,698 మందికిగాను.. 6,384 మంది రాశారు. 314 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ కాక మాధవరావు తెలిపారు. జనరల్ కోర్సు విద్యార్థులు 5,871 మందికిగాను.. 257 మంది గైర్హాజరైనట్లు, ఒకేషనల్ కోర్సు విద్యార్థులు 827 మందికిగాను.. 57 మంది గైర్హాజరైనట్లు వివరించారు.

డిజిటల్ రంగంతో మహిళా సాధికారత



కాజీపేట అర్బన్: మహిళలు డిజిటల్ రంగంతో సాధికారత సాధించి ఆదర్శంగా నిలవాలని సెంట్రల్ జోన్ డీసీపీ పుష్ప అన్నారు. నిట్ వరంగల్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల విన్-23 ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ముగింపు కార్యక్రమానికి శనివారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు సమాజంలో ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించి.. డిజిటల్ రంగంలో తమ సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు, ప్రొఫెసర్లు మాధవి, నయనతార, సత్తిరాజు, కీర్తి శ్రీవాస్తవ, శైలజాకుమారి, స్ఫూర్తి, అంజన తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ కోర్సు పీజీ పరీక్షలు ప్రారంభం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కావాల్సిన సైన్స్ కోర్సు పీజీ పరీక్షలు 2.20 గంటలకు ప్రారంభమయ్యాయి. పరీక్షల విభాగం నుంచి యూనివర్సిటీ పరిధిలోని పరీక్ష కేంద్రాలకు ఆన్‌లైన్‌లో ప్రశ్నపత్రాలు పంపుతారు. అయితే సాంకేతిక కారణాలతో సర్వర్‌డౌన్ కావడం వల్ల ఆ ప్రశ్నపత్రాలను ఓటీపీ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవడంలో సమస్య తలెత్తింది. దీంతో 20 నిమిషాలు ఆలస్యంగా అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో పరీక్ష సమయాన్ని 20 నిమిషాలు అదనంగా కేటాయించారు. సర్వర్ డౌన్ కావడం వల్ల ఈ సమస్య తలెత్తిందని పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి తెలిపారు. కాగా.. క్యాంపస్‌లోని కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లోని పరీక్ష కేంద్రాలను కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.జ్యోతి సందర్శించారు. పరీక్షల నిర్వహణ తీరు తెన్నులను పరిశీలించారు. ఈనెల 20, 23, 25, 27 తేదీల్లో కూడా పరీక్షలు కొనసాగనున్నాయి.

'పది'పై ప్రత్యేక దృష్టి

- వందశాతం ఫలితాల సాధనకు కృషి
- పాఠశాలల్లో కొనసాగుతున్న ప్రత్యేక పర్యవేక్షణ
- ఏప్రిల్ 3 నుంచి వార్షిక పరీక్షలు



లష్కర్ బజార్‌లోని ఉన్నత పాఠశాల ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్

విద్యారణ్యపురి: ఏప్రిల్ 3 నుంచి టెన్త్ పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే సిలబస్ పూర్తయ్యింది. పునశ్చరణ జరుగుతోంది. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులపై జిల్లా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. వందశాతం ఫలితాలు సాధించాలనే లక్ష్యంతోపాటు ఎక్కువ మంది 10/10 జీపీఏ సాధించాలనే ఉద్దేశంతో జిల్లా విద్యాశాఖ ప్రత్యేక మానిటరింగ్ అధికారులను ఏర్పాటు చేసి పర్యవేక్షణ ప్రక్రియ చేపట్టింది.

ప్రత్యేక పర్యవేక్షణ

మానిటరింగ్ బృందాలు జిల్లాలోని ప్రతీ ఉన్నత పాఠశాలను సందర్శిస్తున్నాయి. బృంద సభ్యులు విద్యార్థులు, ఉపాధ్యాయులతో చర్చించి.. విద్యాబోధన, వందశాతం ఫలితాలు సాధించేందుకు అవసరమైన సూచనలిస్తున్నారు. డీఈఓ ఎండీ అబ్దుల్‌హై పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించారు. అందులో జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్(దామెర, ఐనవోలు), ఐఈ అండ్ సీఎంఓ బి.రాధ(హనుమకొండ, కాజీపేట), హనుమకొండ డీసీఈబీ సెక్రటరీ జి.రాజన్న(శాయంపేట, ఆత్మకూరు), ఎల్కతుర్తి ఎంఈఓ ఇ.రవీందర్(ఎల్కతుర్తి, భీమదేవరపల్లి), కమలాపూర్ ఎంఈఓ ఇ.రామకిషన్‌రాజు(కమలాపూర్, హసన్‌పర్తి), ధర్మసాగర్ ఎంఈఓ ఎ.వెంకటేశ్వర్‌రావు(ధర్మసాగర్, వేలేరు), పరకాల ఎంఈఓ ఎస్.రమాదేవి(పరకాల, నడికూడ) ఉన్నారు. వీరు తమకు కేటాయించిన ఆయా మండలాల్లో ఈనెల 13 నుంచి ఉన్నత పాఠశాలలను సందర్శించి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్నారు. హెచ్‌ఎంలతో సమీక్షలు జరిపి అవసరమైన సూచనలిస్తున్నారు. కాగా.. ఇప్పటికే జిల్లా విద్యాశాఖ టెన్త్ విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్‌ను అందిస్తోంది. అభ్యాసన దీపికలను అందజేసింది. ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. స్లిప్ టెస్టుల నిర్వహణ, పునశ్చరణ తరగతులు, విద్యార్థుల దత్తత, వేకప్ కాల్స్ చేస్తున్నారు. తల్లిదండ్రులతో సమావేశాలు కూడా నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల నిపుణుల నంబర్లు కూడా విద్యార్థులకు అందుబాటులో ఉంచారు.

తొలిమెట్టు అమలు..

ఈ ఏడుగురు తమకు కేటాయించిన మండలాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో తొలిమెట్టు అమలు ఎలా జరుగుతుందో కూడా పర్యవేక్షిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో తొలిమెట్టు అమలు తీరును పర్యవేక్షించి ఉపాధ్యాయులు చేపడుతున్న చర్యలను.. విద్యార్థుల గుణాత్మక స్థాయిలను పరిశీలిస్తున్నారు. పాఠ్యప్రణాళిక ఉపయోగిస్తున్నారా? లేదా? అనే అంశాలను పర్యవేక్షిస్తున్నారు.

'ప్రైవేటు' విద్యార్థులకు అవగాహన

జిల్లాలోని ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో గల ఉన్నత పాఠశాలల టెన్త్ విద్యార్థులకు కూడా హడప్సా అంబేడ్కర్ భవనంలో విష్ణుప్రియ గార్డెన్‌లో వేర్వేరుగా టెన్త్ పరీక్షల సన్నద్ధతకు ప్రశ్నపత్రాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని సబ్జెక్టు నిపుణులు, రిసోర్స్ పర్సన్‌లచే అవగాహన కల్పించారు.

పరీక్షలు రాయనున్న 11,738 మంది

జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 11,738 మంది పరీక్షలు రాయనున్నారు. అందులో 6,011 మంది బాలురు, 5,727 మంది బాలికలు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 5,510 మంది, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 6,228 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు 68 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇటీవల పరీక్షల నిర్వహణపై కలెక్టర్ సిక్తా పట్నాయక్ సమీక్షించారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా..



జిల్లాలో పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధుల్ని చేసేందుకు చర్యలు చేపట్టాం. ఉపాధ్యాయులు తమ సబ్జెక్టుల్లో ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణుడయ్యేలా చూడాలని ఆదేశించాం. ఇప్పటికే హెచ్‌ఎంలకు స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ఇంకేమైనా ఇబ్బందులున్నా పర్యవేక్షిస్తున్నాం.

- ఎండీ అబ్దుల్‌హై, డీఈఓ

ప్రశ్నపత్రాలపై సాధన చేయించాలి..



టెన్త్ విద్యార్థులకు గతంలో 11 ప్రశ్నపత్రాలు ఉండేవి. ఇప్పుడు ఆరు ప్రశ్నపత్రాలు మాత్రమే ఉంటాయి. మాదిరి ప్రశ్నపత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమం టీశాట్ ద్వారా అందించడమే కాకుండా.. సబ్జెక్టుపరంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. సరైన విధంగా తర్ఫీదునిచ్చి, పరీక్షలంటే భయం లేకుండా చూడాలని ఉపాధ్యాయులను కోరుతున్నాం .

- ఎ.శ్రీనివాస్, జిల్లా క్వాలిటీ కో–ఆర్డినేటర్

బీజేపీ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- టీఎస్ పీఎస్‌సీ ప్రశ్నపత్రం లీకేజీపై నిరసన
- కలెక్టరేట్‌లోకి ప్రవేశించేందుకు పార్టీ శ్రేణుల యత్నం
- అడ్డుకున్న పోలీసులు.. తోపులాట
- పలువురి అరెస్ట్..స్టేషన్‌కు తరలింపు



ముళ్లకంచెను దాటి కలెక్టరేట్ ప్రహరీ ఎక్కుతున్న కార్యకర్తను ఆపుతున్న పోలీసులు



కార్యకర్తను ఈడ్చుకెళ్తున్న పోలీసులు



రావు పద్మ, నాయకులను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులు

హన్మకొండ: టీఎస్ పీఎస్‌సీ ప్రశ్నపత్రం లీకేజీకి నిరసనగా బీజేపీ చేపట్టిన హనుమకొండ కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తతకు దారితీసింది. లీకేజీ బాధ్యులను శిక్షించాలని, హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని, పరీక్షకు హాజరైన ప్రతి అభ్యర్థికి రూ.లక్ష పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ హనుమకొండ జిల్లా శాఖ అధ్వర్యంలో శనివారం ధర్నా, కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ముందుగా తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ధర్నా చేసిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు సుబేదారిలోని కలెక్టరేట్‌కు ర్యాలీగా చేరుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ముందు జాగ్రత్త చర్యలో భాగంగా కలెక్టరేట్ గేట్లు మూసివేయడంతోపాటు ముళ్లకంచె ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ వరకు చేరుకున్న బీజేపీ శ్రేణులు లోపలికి ప్రవేశించేందుకు యత్నించారు. ఈ క్రమంలో పోలీసులు, బీజేపీ నాయకులు, కార్యకర్తల మధ్య తీవ్ర తోపులాట జరిగింది. గేట్‌పక్కన ప్రహరీ దూకేందుకు బీజేపీ కార్యకర్తలు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. తమపై పోలీసులు చేయి చేసుకున్నట్లు కొందరు చెప్పడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ కార్యకర్తల గొంతు నొక్కడంతోపాటు కాళ్ల అడ్డుపెట్టి హింసించడాన్ని ప్రశ్నించినందుకు తనపై కేయూ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దయాకర్ చేయి చేసుకున్నారని రాజు అనే కార్యకర్త తెలిపారు. మరోవైపు ఏఎస్సైలు లాఠీని ప్రయోగించారు. పరిస్థితులు తీవ్ర స్థాయికి చేరుకోవడంతో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలిస్తుండగా కార్యకర్తలు ఆ వాహనాన్ని అడ్డుకున్నారు. అడ్డంగా రోడ్డుపై బైఠాయించారు. కార్యకర్తలను బలవంతంగా తొలగించి రావు పద్మ, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డితోపాటు నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రావు పద్మ, ఇతర నాయకులు మాట్లాడుతూ టీఎస్ పీఎస్‌సీ నిర్వహించిన పరీక్షలను రద్దు చేయడం కాదు... అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న, ప్రజలను పీడిస్తున్న కల్వకుంట్ల కుటుంబ పాలనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, మొలుగూరి భిక్షపతి, నాయకులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, చాడ శ్రీనివాస్‌రెడ్డి, గురుమూర్తి శివకుమార్, గుజ్జ సత్యనారాయణ, కాచం గురుప్రసాద్, దేశిని సదానందంగౌడ్, ఆర్‌పీ.జయంత్‌లాల్, కొండి జితేందర్‌రెడ్డి, తాళ్లపల్లి కుమారస్వామి, రావుల కిషన్, అశోక్‌రెడ్డి, రాజన్, మేఘనాథ్, రవినాయక్, భద్రయ్య, గురిజాల శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు.

పసుపు ఉత్పత్తిలో మనమే ఫస్ట్

ఉద్యోగులు పని చేసే చోటే నివాసముండాలి
టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్ గోపాల్‌రావు

- వివరాలు 10లో

రక్తహీనతను అధిగమించడమే 'ఆయుష్' లక్ష్యం

ఆయుష్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్.మహేంద్రకుమార్



ఆయుష్ కిట్లతో ఐనవోలు కేజీబీవీ విద్యార్థినులు

ఐనవోలు: పదో తరగతి విద్యార్థినుల్లో రోగ నిరోధక శక్తిని పెంపొందించడం, రక్త హీనత సమస్యను తొలగించడం లక్ష్యంగా ఆయుష్ మిషన్ కార్యక్రమాలు చేపట్టినట్లు సీనియర్ మెడికల్ ఆఫీసర్, ఆయుష్ జిల్లా ఇన్‌చార్జ్ ఎస్.మహేంద్రకుమార్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)లో ఆయుష్ మిషన్ ద్వారా హెల్త్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మహేంద్ర కుమార్ మాట్లాడుతూ బాలికలు యుక్త వయస్సులో వచ్చే సమస్యలను అధిగమిస్తే చదువుపై ఏకాగ్రత సాధించి మంచి ఫలితాలు పొందుతారన్నారు. విద్యాశాఖ సహకారంతో జిల్లావ్యాప్తంగా తొమ్మిది పాఠశాలలను ఎంపిక చేసుకుని మూడు రోజులపాటు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఐనవోలు కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పించి ఆయుష్ కిట్లను అందజేసినట్లు తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న సమయంలో విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. జ్ఞాపకశక్తి, వ్యాధి నిరోధకశక్తి పెంపొందడానికి ఆయుష్ కిట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్‌కుమార్, కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ కె.సునీత, ఫార్మసిస్టు శంకర్, తిరుమల్‌రెడ్డి, యాకసాయిలు, పాఠశాల ఉపాధ్యాయురాళ్లు పాల్గొన్నారు.

శిక్షణ అంశాలను పకడ్బందీగా అమలు చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్



మాట్లాడుతున్న డీపీఓ జగదీశ్వర్

కమలాపూర్: మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ శిబిరంలోని అంశాలను గ్రామాల్లో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వి.జగదీశ్వర్ సూచించారు. కమలాపూర్‌తోపాటు శంభునిపల్లిలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ క్షేత్ర సహాయకులు, మహిళా సంఘాల గ్రామ దీపికలకు మూడు రోజులపాటు నిర్వహించిన శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, డ్రైయినేజీలు, తడి, పొడిచెత్త వేరు చేసే విధానం, ప్లాస్టిక్ నిషేధం, విలేజ్ స్వచ్ఛత ప్లాన్, ఓడీఎఫ్ ప్లస్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహిస్తూ విలేజ్ స్వచ్ఛత ప్లాన్‌ను వెంటనే తయారు చేసి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రవిబాబు, స్వచ్ఛభారత్ జిల్లా ప్రతినిధి సంపత్‌కుమార్, ఈజీఎస్ ఏపీఓ రమేష్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలు పాల్గొన్నారు.

న్యాయ సేవలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి గోపిక నాగశ్రావ్య

ఐనవోలు: న్యాయ సేవలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని హనుమకొండ ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పెనుమాల గోపిక నాగశ్రావ్య అన్నారు. శనివారం ఒంటిమామిడిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ(డీఎల్ఎస్ఏ) హనుమకొండ ఆధ్వర్యంలో లీగల్ అవేర్‌నెస్ కార్యక్రమం ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ప్రతాప రత్నకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి నాగశ్రావ్య మాట్లాడుతూ న్యాయ వ్యవస్థ, రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సహాయం, బాల్య వివాహాలు, విద్యా హక్కు చట్టం, ఆర్టీఐ యాక్టు గురించి ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలన్నారు. అన్యాయం జరిగితే న్యాయ స్థానాలను ఆశ్రయించాలని, అక్కడే సరైన న్యాయం అందుతుందని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పొన్నాల రాజు, ఎస్సై గుగులోతు వెంకన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడడం మన బాధ్యత

మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సీపీఆర్ డెమో చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

వరంగల్ రూరల్: ప్రజల ప్రాణాల్ని కాపాడడం మనందరి బాధ్యత అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం వరంగల్ కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై శిక్షణ నిర్వహించారు. ఇందులో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు సీఎం కేసీఆర్ నిత్యం శ్రద్ధ చూపుతున్నారన్నారు. కళ్ల ముందు తిరిగినవారు చూస్తుండగానే.. ఆకస్మిక గుండెపోటు కారణంగా క్షణాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సీపీఆర్‌పై శిక్షణ ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులకు సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రైవేట్ అసోసియేషన్లు, కాలేజీ యాజమాన్యాలు, ఇతర ఎవరైనా.. సీపీఆర్‌పై శిక్షణ కావాలని అడిగితే హైదరాబాద్‌లో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లను పంపిస్తామని కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. తాను హైదరాబాద్‌లో పని చేస్తున్నప్పుడు ప్రతీ కానిస్టేబుల్, హోంగార్డు సీపీఆర్ శిక్షణ చేసి రావాలని నిబంధన పెట్టామన్నారు. జిల్లాలో పోలీస్ కమిషనరేట్ పరిధి ట్రాఫిక్, నాన్–ట్రాఫిక్, కానిస్టేబుళ్లు, హోంగార్డులతో సహా అందరినీ సీపీఆర్ శిక్షణలో భాగస్వాములను చేసి, ఆకస్మికంగా గుండెపోటుకు గురయ్యే వారిని కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని సీపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేయర్ సుధారాణి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్రజ్యోతి, వర్ధన్నపేట శాసనసభ్యులు అరూరి రమేశ్, ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య, 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) శ్రీవత్స కోట, (స్థానిక సంస్థలు) అశ్విని తానాజీ వాకడే, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘాల మధ్య చిచ్చుపెడుతున్న ఎమ్మెల్యే

మాజీ మంత్రి కొండా సురేఖ



వరంగల్ పిన్నావారి వీధిలో పర్యటిస్తున్న మాజీ మంత్రి కొండా సురేఖ

వరంగల్ చౌరస్తా: వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కులాల మధ్య చిచ్చుపెట్టి ఎమ్మెల్యే నరేందర్ రాజకీయం చేస్తున్నారని మాజీ మంత్రి కొండా సురేఖ విమర్శించారు. శనివారం వరంగల్ 28వ డివిజన్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర జరిగింది. బట్టలబజారు, పాతబీటుబజారు, పిన్నావారి వీధి, ఎల్లంబజారు తదితర కాలనీల్లో పర్యటించారు. పలు వ్యాపార సముదాయాల్లో వ్యాపారులను సురేఖ కలిసి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ నగరం నడిబొడ్డున ఉన్న 28వ డివిజన్‌లో వీధిలైట్లు వెలగక అంధకారం నెలకొంటుందన్నారు. కాంగ్రెస్ నాయకులు మడిపెల్లి కృష్ణ, కురుమిల్ల సంపత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మీసాల ప్రకాష్ , నల్లగొండ రమేష్, చిప్ప వెంకటేశ్వర్లు, కొత్తపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐలోని మల్లన్న కల్యాణం



గర్భాలయంలో గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మలతో మల్లికార్జునస్వామి

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో కల్యాణం, మహా పెద్దపట్నం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. ప్రఖ్యాత ఆలయంలో మూడేళ్లుగా ఉగాది ముందు ఆదివారం కల్యాణం, పెద్దపట్నం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సాధారణంగా శివరాత్రి రోజు ఉదయం 12 ఫీట్ల పొడవు, వెడల్పుతో ఒగ్గు పూజారులతో పెద్దపట్నం వేయించి, సాయంత్రం భ్రమరాంబిక సమేత శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం నిర్వహిస్తుంటారు. ఆ ఆనవాయితీని కొనసాగిస్తూనే గర్భాలయంలో కొలువైన గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మలతో స్వామివారి కల్యాణం జరిపించాలనే తలంపుతో మహా పెద్దపట్నం, కల్యాణం నిర్వహణ ప్రారంభమైంది. ఆలయ ప్రాంగణంలోని నటరాజస్వామి విగ్రహం ఎదుట ఆదివారం 36 ఫీట్ల పొడవు, వెడల్పుతో మహా పెద్దపట్నం వేయించి, బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలతో శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం శైవ ఆగమోక్తంగా వైభవోపేతంగా నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ కోరారు.

లోక్ అదాలత్‌తో కక్షిదారులకు న్యాయం

హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.కృష్ణమూర్తి



కక్షిదారులకు అవార్డు కాపీ అందజేస్తున్న హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కృష్ణమూర్తి

వరంగల్ లీగల్: బ్యాంక్ లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారంతోపాటు కక్షిదారులకు న్యాయం జరుగుతుందని హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎం.కృష్ణమూర్తి అన్నారు. వరంగల్ జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన బ్యాంకు లోక్ అదాలత్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వరంగల్ జిల్లా పరిధిలో యూనియన్ బ్యాంకు మొత్తం 23 పీఎల్‌సీ కేసులకు.. రూ.53.70లక్షలు చెల్లించేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. అలాగే హనుమకొండ జిల్లాలో 19 పీఎల్‌సీ కేసులకు.. రూ.43,26,200 చెల్లించడానికి ఒప్పందం కుదిరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయసేవాధికార సంస్థ వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు ఉపేందర్‌రావు, బి.శ్రీనివాసులు, యూనియన్ బ్యాంకు రీజినల్ అధికారి పలుగుల సత్యం, లా ఆఫీసర్ ఎం.శశిధర్, వివిధ బ్యాంకు మేనేజర్లు, పలు గ్రామాల కక్షిదారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు..ఆరోగ్యానికి మేలు



మాట్లాడుతున్న డాక్టర్ మహేందర్

కరీమాబాద్: ఆరోగ్యానికి చిరుధాన్యాలు ఎంతో మేలు చేస్తాయని పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ విస్తరణాధికారి డాక్టర్ మల్లం మ హేందర్ అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సదస్సును పురస్కరించుకుని శనివారం మామునూరు కేవీకేలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరి స్థితుల్లో హానికరమైన ఆహారపు అలవాట్లకు దూ రంగా ఉండాలని సూచించారు. ప్రకృతిపరమైన చిరుధాన్యాలు మానవ మనుగడకు, ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా చిరుధాన్యాలకు ఎంతో డిమాండ్ ఉందని పేర్కొన్నారు. ఈక్రమంలోనే ప్రధాని మోదీ ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించడమే కాకుండా ఐక్యరాజ్యసమితితో కూడా ప్రకటింపచేశారని తెలిపారు. కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న మాట్లాడుతూ పూర్వకాలంలో వినియోగించిన ఆహారపు అలవాట్లు కొనసాగించడం అందరి బాధ్యత అన్నారు. చిరుధాన్యాల ఉత్పత్తులతో అధిక లాభాలు పొందవచ్చని చెప్పారు. డాక్టర్ సౌమ్య, డాక్టర్ అరుణజ్యోతి, డాక్టర్ రాజు, డాక్టర్ గణేశ్, డాక్టర్ సాయికిరణ్, పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

కాజీపేట: 62వ డివిజన్ సోమిడి శివారులో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బస్సు డ్రైవర్ మృతి చెందాడు. ధర్మసాగర్‌కు చెందిన ఎండీ.గౌస్ (45) మడికొండ రామన్ స్కూల్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. పిల్లలను తీసుకుని కాజీపేటకు వస్తుండగా బస్సులో సాంకేతికలోపం తలెత్తడంతో ఆగిపోయింది. డ్రైవర్ కిందకు దిగి బస్సును మరమ్మతు చేస్తుండగా బస్సు ఆకస్మాత్తుగా ముందుకు కదలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని చేసి విచారణ చేపడుతున్నట్లు కాజీపేట పోలీసులు తెలిపారు.

అనాథలను కదిలిస్తే కన్నీళ్లే..!



- ఆదరణలేని వృద్ధులకు ఆశ్రయం
- అనాథ ఆశ్రమం ఓ దేవాలయం
- మేమున్నామంటూ అమ్మలా ఆదరిస్తున్న 'ఎలగందుల' వృద్ధాశ్రమం

ఖిలావరంగల్: నా అనే వాళ్లు లేక కొందరు.. ఉన్నా పట్టించుకోని వారు మరికొందరు.. కారణమేదైనా జీవితం చివరి దశలో పండుటాకులు ఆదరణ కోల్పోయి ఆశ్రమంలో కాలం వెళ్లదీస్తున్నారు. మానవసేవే మాధవ సేవగా భావిస్తూ అనాథలను అమ్మలా ఆదరిస్తూ సమాజ నిరాధరణ, కుటుంబ సభ్యుల నిర్లక్ష్యానికిలోనై నిస్సహాయ స్థితిలో ఉన్న వారిని అక్కున చేర్చుకుని ఆశ్రయం కల్పిస్తోంది. చివరికి చనిపోయాక కూడా దహన సంస్కారాలు నిర్వహిస్తుంది ఖిలావరంగల్ మండలంలోని రాంగోపాలపురంలోని ఎలగందుల అమృత స్మారక వృద్ధాశ్రమం. జిల్లాలోని సరస్వతీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఎలగందుల లక్ష్మీనారాయణ ఎవరూలేని అనాథలతో పాటు కొడుకులు, కూతుర్లు చీదరించుకున్న తల్లిదండ్రులను ఆదరిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు. తల్లిలా లాలిస్తూ.. తండ్రిలా ఆదరిస్తూ.. కుటుంబ సభ్యుల్లా పలకరిస్తూ అనాథల కన్నీళ్లను తుడుస్తూ ముందుకు సాగుతున్నాడు.



మాట్లాడుతున్న నిర్వాకుడు ఎలగందుల లక్ష్మీనారాయణ



ఆశ్రమంలో సేద తీరుతున్న వృద్ధులు..

ఆలోచన ఎలా వచ్చింది..

ఉపాధ్యాయ వృత్తిలో రిటైరయ్యాను.. సేవ చేయాలనే ఆలోచనతో 1999లో ఎలగందుల అమృత స్మారకార్థం ఆశ్రమం స్థాపించానంటున్నారు ఆశ్రమ వ్యవస్థాపక నిర్వాహకులు ఎలగందుల లక్ష్మీనారాయణ. హెడ్ మాస్టర్‌గా రిటైర్డు అయిన తర్వాత సుమారు 1000 గజాల స్థలంలో రాంగోపాల్‌పురం గ్రామ సమీపంలో ఆశ్రమం నిర్మాణానికి నడుంబిగించాను. నిధుల లేమితో కొన్ని ఇబ్బందులు పడ్డాను. దాతల సహకారంతో అనుకున్న పనిని విజయవంతంగా కొనసాగిస్తున్నాను.

చనిపోయిన వారికి దహన సంస్కారాలు సైతం..

ఆశ్రమంలో చేరినప్పటి నుంచి చివరి వరకు ఉండి ఆ తర్వాత చనిపోయిన వృద్ధులకు దహన సంస్కారాలు ఆశ్రమ నిర్వాహకులే నిర్వహించడం విశేషం. ఒకసారి ఆశ్రమంలో చేరాక మా కుటుంబ సభ్యుల లాగే మేం భావిస్తామని, ఎవరైనా వృద్ధులు చనిపోతే మా ఇంట్లో సభ్యుడు చనిపోయిన విధంగా భావిస్తామని చెబుతున్నారు ఆశ్రమ నిర్వాహకులు.

ప్రభుత్వం సహకరిస్తే సేవలు విస్తరిస్తా..



నేను 70 ఏళ్ల వృద్ధుడిని..నాతోటి వృద్ధులకు చేరదీసి ఆకలి తీర్చాలన్నదే నాకోరిక. నాకు చిన్నప్పటి నుంచి సేవ చేయాలనే భావన ఉండేది. వృద్ధులు అంటే చీదరించుకునే వారు చాలామంది ఉన్నారు. నాకు చేతనైనంత సహాయం చేయడమే నాకు సంతృప్తి. ప్రభుత్వం సహకరిస్తే ఆదరణ కోల్పోయిన వారికి మరింత మందికి ఆశ్రయం కల్పిస్తాం.

- లక్ష్మీనారాయణ ఆశ్రమ చైర్మన్

నాకు ఎవరూ లేరనే బాధ లేదు



ఈ ఆశ్రమంలో చేరినప్పటి నుంచి నాకు ఎవరూ లేరనే బాధ లేదు.నాకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు బిడ్డలు ఉన్నారు. ఒక కొడుకు లోకానికి దూరమయ్యాడు. బిడ్డలు పట్టించుకోరూ. మనవళ్ల ప్రేమకు దూరం చేశారు. నన్ను మా మనవడు ఆశ్రమంలో ఉంచాడు. ఇక్కడివాళ్లు కుటుంబ సభ్యుల్లా చూసుకుంటున్నారు. నాకు ఏ లోటు లేదు.

- జ్యోతి యాకమ్మ, వృద్ధురాలు

ఆరేళ్లు నుంచి ఇక్కడే ఉంటున్నా..



బస్సు ప్రమాదంలో రెండు కాళ్లు పోయాయి. నా భార్య అనారోగ్యంతో మృతి చెందింది. నాకు ఏకైక కుమార్తె ఉన్నా.. నా కాళ్లు పోగానే నన్ను చీదిరించుకుని నేరుగా నన్ను ఆశ్రమంలో వదిలేసి వెళ్లింది. నా అత్త దేవత నాకు ఆర్థికసాయం చేస్తోంది. ఇక్కడి వారే నా బిడ్డలు తల్లిదండ్రులుగా భావిస్తున్నా.

- తాడూరి వేణుగోపాల్

నెక్కొండలో అక్రమ మద్యం పట్టివేత

నెక్కొండ: అక్రమ మద్యంను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్టు చేసిన సంఘటన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ హథీరాం నాయక్ తెలిపిన వివరాలు... రైలు ద్వారా అక్రమ మద్యం దందాకు పాల్పడుతుండగా పక్కా సమాచారం మేరకు స్థానిక రైల్వే స్టేషన్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తనిఖీలో భాగంగా అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తిని అతని వద్ద ఉన్న బ్యాగులను పోలీసులు సోదా చేశారు. భూపాలపల్లి జిల్లా మహాముత్తారం గ్రామానికి చెందిన మహ్మద్ మెహబూబ్‌పాష, అతని కుమారుడు మహ్మద్ రఫీ మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యంను రైళ్ల ద్వారా తెలంగాణ రాష్ట్రానికి తీసుకొచ్చి విక్రయానికి పాల్పడుతునట్లు తేలిందని సీఐ పేర్కొన్నారు. మెహబూబ్‌పాషను అరెస్టు చేశామని, రఫీ పరారీలో ఉన్నట్లు చెప్పారు. వీరి నుంచి సిగ్నేచర్ ఫుల్ బాటిళ్లు 47, ఆర్‌సీ ఫుల్ బాటిళ్లు 12, వీటి విలువ సుమారు రూ. 73,305 ఉంటుందన్నారు. కార్యక్రమంలో నర్సంపేట ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరీ, పోలీసులు, పాల్గొన్నారు.

బాల్య వివాహాలను కట్టడి చేద్దాం..

సీపీ ఏవీ రంగనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైమ్: బాలల హక్కులను కాపాడటంతోపాటు బాల్య వివాహాలను కట్టడి చేద్దామని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ పిలుపునిచ్చారు. శనివారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో బాల్య వివాహాలు, భ్రూణ హత్యల నియంత్రణపై సీడబ్ల్యూసీ సభ్యులు, సీడీపీఓలు, తహసీల్దార్లు, ఎంఈఓలు, పోలీస్ అధికారులతో సీపీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు అధికంగా జరిగే ప్రాంతాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కోసం సంబంధిత అధికారులు శ్రమించాల్సి ఉంటుందన్నారు. బాల్య వివాహాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై పోలీసులు దృష్టి సారించాలని, సమాచారం అందిస్తే వివాహం ఆపేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలను అరికట్టేందుకు స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టాలని, వ్యభిచారం జరిగే ప్రాంతాలు, నిర్వాహకులపై నిఘా కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. సమావేశంలో క్రైమ్ డీసీపీ మురళీధర్, పరిపాలనా విభాగం అదనపు డీసీపీ పుష్పారెడ్డి, యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుజాతతోపాటు వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, ఏహెచ్‌టీయూ సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లి ఇంట విషాదం

- గుండెపోటుతో వధువు తల్లి మృతి
- శోక సంద్రంలో ఇరు కుటుంబాలు



స్వరూప (ఫైల్)



పెళ్లిలో అల్లుడు, కుమార్తెతో స్వరూప (కుడి వైపు నుంచి రెండో వ్యక్తి)

బచ్చన్నపేట : అమ్మాయి, అబ్బాయి తరుపున వారందరూ కలిసి శుక్రవారం మండలంలోని శ్రీనిధి గార్డెన్‌లో వైభవంగా వివాహాన్ని జరిపించారు. రాత్రివేళ బరాత్ తీసి అమ్మాయి, అబ్బాయిని ఇంటిలోకి సాగనంపిన అనంతరం అమ్మాయి తల్లి శనివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందింది. దీంతో ఇరు కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జక్కుల కనుకమ్మ, అయ్యాల్లం దంపతుల కుమారుడికి సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం మర్మాముల శివారు బంజేరుకు చెందిన జంగిలి స్వరూప (35), మల్లేశం దంపతుల కూతురు మౌనికను ఇచ్చి పెళ్లి జరిపించారు. శనివారం పదహారు పండుగ జరుపుకునే క్రమంలో అందరూ బీజీగా ఉండగా పెళ్లి కూతురు తల్లి స్వరూప ఉదయం మోహం కడుక్కుంటూ కుప్పకూలింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పెళ్లి ఇంట్లో అశుభం జరుగడంతో వచ్చిన బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతురాలికి పెళ్లి కావల్సిన మరో ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నాగ్‌పూర్ మార్కెట్ సందర్శన



నాగపూర్ మార్కెట్‌లో మిర్చిని పరిశీలిస్తున్న వరంగల్ మార్కెట్ కమిటీ సభ్యులు, అధికారులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం స్టడీ టూర్ (అంతర్‌రాష్ట్ర మార్కెట్ సందర్శన)లో భాగంగా వైస్ చైర్మన్ కాలేరు కరంచంద్ ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని నాగపూర్ మార్కెట్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లోని రెగ్యులేషన్ పద్ధతులు, అమలు చేస్తున్న విధి విధానాలను పరిశీలించారు. అనంతరం మార్కెట్ కార్యదర్శిని కలిసి మార్కెట్‌లోని షాపులు, అడ్తి వ్యవస్థకు సంబంధించిన వివరాలు, మార్కెట్‌లోని మిర్చియార్డులు, పండ్లు, కూరగాయలు, ఉల్లిగడ్డ, ఆలుగడ్డ యార్డుల నందు వేలం పా టలు, కొనుగోళ్ల గురించి తెలుసుకున్నారు. వ రంగల్ మార్కెట్‌లో లేనటువంటి మెరుగైన వసతులు ఏవైనా ఉంటే వాటిని వరంగల్ మార్కెట్‌లో అమలు చేసేందుకు కృషి చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. టూర్‌లో కమిటీ సభ్యులు గోలి రాజయ్య, పసునూరి సారంగపాణి, తుమ్మ రవీందర్‌రెడ్డి, పట్టాపురం ఏకాంతంగౌడ్, పల్లెపాటి శాంతిరతన్‌రావు, పిన్నింటి వెంకట్‌రావు, ఉన్నత శ్రేణి కార్యదర్శి బి.వి.రాహుల్, గ్రేడ్–2 కార్యదర్శి టీ.చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కిట్స్‌లో 'కేరింతలు'

- విద్యార్థుల్లో 'హేమచంద్ర' జోష్
- ర్యాంప్‌పై విద్యార్థుల ప్రదర్శనలు
- ముగిసిన సంస్కృతి–23 వేడుకలు



హసన్‌పర్తి: విద్యార్థుల కేరింతలతో కిట్స్ కళాశాల ప్రాంగణం మార్మోగింది. కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన సంస్కృతి–23 వేడుకలు శనివారం అర్ధరాత్రి వరకు సాగాయి. ఈ సందర్భంగా ప్రముఖ సినీగాయకుడు హేమచంద్, డీజె ధనిక, డివోల్ఫ్ మాక్ ప్రదర్శనలు ఉర్రూతలుగించాయి. రాంప్‌పై విద్యార్థుల ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ శంకర్, ప్రొఫెసర్ నరసింహారావు, డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ ప్రభాకరాచారి, స్టూడెంట్స్ క్లబ్ కార్యదర్శులు ఐశ్వర్య, జాఫర్ అహ్మద్, సుహాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై దాడి

హసన్‌పర్తి: మండలంలోని వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మేర్గు రాజేష్‌పై దాడి జరిగిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వ్యక్తిగత పనులు ముగించుకుని బైక్‌పై రాజేష్ ఇంటికి బయల్దేరగా మార్గమధ్యలో ముగ్గురు వ్యక్తులు అడ్డంగా వచ్చి బైక్‌ను కాళ్లతో బలంగా కొట్టారు. ఈ సంఘటనలో రాజేష్ కిందపడడంతో బలమైన గాయాలయ్యాయి. మారణాయుధాలు ఉన్నట్లు గమనించిన రాజేష్ వారి నుంచి తప్పించుకున్నాడు. గమనించిన ఇద్దరు యువకులు కేకలు వేయడంతో వారు పరారయ్యారు.

పోలీస్‌స్టేషన్‌లోఫిర్యాదు...

హసన్‌పర్తికి చెందిన రాకేష్, నితిన్, కన్నయ్య దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈఘటనలపై దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాలుగు నెలలుగానే...

ఇదిలా ఉండగా నాలుగు నెలలుగా రాజేష్‌పై దాడికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిసింది. రెండు నెలల క్రితం దామెర సమీపంలో రాజేష్‌పై దాడి చేయడానికి యత్నించారని స్థానికంగా చర్చ జరుగుతోంది.

డిటోనేటర్ల కలకలం

- మేకల కాపరి ఇచ్చిన సమాచారంతో పోలీసుల అప్రమత్తం
- బాంబుస్క్వాడ్ తనిఖీల్లో బయటపడ్డ 500 డిటోనేటర్లు

బయ్యారం: మండలకేంద్రంలో శనివారం రాత్రి పోలీసులకు పట్టుబడ్డ ఎలక్ట్రిక్ డిటోనేటర్లు స్థానికంగా కలకలం రేపాయి. వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారంలోని వ్యవసాయశాఖ కార్యాలయం వెనుకభాగంలో ఉన్న ఖాళీ స్థలంలో ఒక గోనె సంచిలో ఎలక్ట్రిక్ డిటోనేటర్లు (మందుగుండు సామాగ్రి) ను మేకలకాపరి గుర్తించాడు. ఈ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. వెంటనే ప్రాంతానికి చేరుకున్న గార్ల–బయ్యారం సీఐ బాలాజీ, ఎస్సై రమాదేవి సోదాలు నిర్వహించి బాంబుస్క్వాడ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ బృందం ఆ ప్రాంతానికి చేరుకొని పాత గోనెసంచిలో ఉన్న డిటోనేటర్లను స్వాధీనపర్చుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

జనావాసాల మధ్యకు ఎలా వచ్చాయి...?

పోలీస్‌స్టేషన్‌కు అరకిలోమీటర్ దూరంలో జనావాసాలు ఉండే ప్రాంతంలోకి పేలుడుకు ఉపయోగించే డిటోనేటర్లు ఎలా వచ్చాయి అనే ప్రశ్నలు పలువురిలో వ్యక్తమవుతున్నాయి. డిటోనేటర్లను క్రషర్‌బండ్ల నిర్వాహకులు పె ట్టారా లేక గతంలో మండలంలో ప్రాబల్యం ఉన్న నక్సల్స్ గ్రూపులు పెట్టారా అనే విషయం విచారణలో తేలాల్సి ఉంది. ఈ విషయంపై సీఐ బాలజీని వివరణ కోరగా డిటోనేటర్లు లభ్యమైన విషయం వాస్తవమేనని ఈ డిటోనేటర్లను ఎవరు పెట్టారు అనే విషయంపై విచారణ నిర్వహిస్తామన్నారు.

సత్యనారాయణగౌడ్‌కు సన్మానం



సత్యనారాయణ గౌడ్‌ను సన్మానిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

వరంగల్ లీగల్: హత్యకేసులో నేరస్తుడికి జీవితఖైదిశిక్ష పడటానికి తన వాదనలను వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సత్యనారాయణగౌడ్‌ను శనివారం మృతుడి కుటుంబ సభ్యులు అభినందించారు. హనుమకొండ యాదవనగర్‌కు చెందిన సుద్దపెల్లి సాంబయ్యను (మృతుడు) ఆయన అల్లుడు 2017 ఆగస్టు 4న హత్యచేశాడు. ఈ కేసులో ప్రత్యేక ప్రాసిక్యూటర్‌గా నియమితులైన సత్యనారాయణ గౌడ్ వాదనలతో ఏకీభవించిన హనుమకొండ జిల్లా ప్రధాన న్యాయస్థానం జనగామ జిల్లా పాలకుర్తికి చెందిన నేరస్తుడు బెల్ల మహేందర్‌కు జీవితఖైది విధించింది. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ మృతుడి కుటుంబ సభ్యులు కొడుకు, కూతుర్లు సత్యనారాయణగౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఉర్సుగుట్ట భూమి సర్వే



ఉర్సుగుట్ట భూములను పరిశీలిస్తున్న సర్వేయర్లు

కరీమాబాద్: ఉర్సుగుట్టలో సర్వేనంబర్ 355లోని ప్రభుత్వ భూమిని శనివారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా రక్షించడంలో భాగంగా కొలతలు వేసి హద్దులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, సర్వేయర్‌లు భుజంగరావు, రజిత, దసరా ఉత్సవ కమిటీ కార్యదర్శి మేడిది మధుసూదన్, మరుపల్ల గౌతం, గౌడ రాము సదానందంలు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సంగెం : మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నల్లగొండ జిల్లా కటంగూర్ మండలం చెరువు అన్నారం గ్రామానికి చెందిన వరికుప్పల ఇస్తారి భార్య పిల్లలతో కలిసి వచ్చి 7 ఏళ్లుగా తిమ్మాపూర్‌లో ఉంటూ బావులు పూడిక తీస్తూ జీవిస్తున్నాడు. ఇస్తారి కుమారుడు జనార్ధన్ (22) నాలుగేళ్ల క్రితం ఎల్గూర్‌రంగంపేటకు చెందిన అనూషను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం. ఇటీవల జనార్ధన్ తాగుడుకు బానిసయ్యాడు. శనివారం బాలునాయక్ తండాలో బావిపూడికకు తల్లిదండ్రులతో కలిసి వెళ్లిన అతను పనిచేయకుండా ఇంటికి తిరిగివచ్చాడు. భార్య అనూష బట్టలు ఉతికి సాయంత్రం ఇంట్లోకి వెళ్లేందుకు చూడగా లోపల గొళ్లెం పెట్టి ఉంది. అనుమానం వచ్చి చుట్టుపక్కల వారు వాసం నరేష్, అడ్డగట్ల రాజులను పిలువగా తలుపులు తీసి వెళ్లి చూడగా ఉరేసుకొని మృతి చెందాడు.